కాల్పనిక జగత్తు

సాయంకాలపు నీరెండలో పెరట్లో చాపవేసుకుని ఆంగ్ల వారపత్రిక చూస్తూ కూర్చున్నది దుర్గ. పిల్లలు బాదంచెట్టు క్రింద ఆడుకుంటున్నారు. మధ్య మధ్య పిల్లలను చూస్తూ పత్రిక పేజీలు తిరగవేస్తున్నది. ఆమె మనసు మాత్రం అటువంటి తీరికవేళల్లో ఒళ్లు జలదరించే జీవిత ఘట్టాలమీదికి పరుగులు తీస్తూ ఉంటుంది. ఆ ఘట్టాలలో ఒకటి మరీ ఉజ్జ్వలమైనదీ- మదురాతిమధుర మయినది.

దుర్గ అనుకుంటుంది "మనుష్యుల కంటే వాళ్ళకు సంబంధించిన స్మృతులు- మధురమైనవా?" అని.

"అవును. మధురమైనవే" అంటుంది మనసు.

అప్పుడు- అంటే తను చదువుకునే రోజుల్లో ఒక్కొక్కనాడు తను కాలేజీకి వెళ్ళటానికి బస్సు అందుకోలేకపోయేది. తమ యింటినుంచి రెండు ఫర్లాంగులు నడిస్తేనేగాని బస్‌స్టాండుకు చేరుకోలేకపోయేది. అప్పుడప్పుడు నడక వేగం తగ్గిపోయేది. అటువంటి సందర్భాలలో అక్కడ బస్సు దొరక్కపోతే మరొక బస్సు వచ్చేవరకూ ఆగవలసి వచ్చేది. అప్పుడప్పుడు మరొక స్టాపు దగ్గరకు నడుస్తూ వెళ్ళేది. ఆ దారిన నడుస్తుంటే ఆర్చీలు చెక్కిన వరండాలు గల ఇంటివైపు కళ్ళు వాటంతట అవి తిరిగేవి. సరిగ్గా ఆ సమయంలో ట్రిమ్‌గా డ్రస్సు వేసుకున్న యువకుడు చేతులు కట్టుకుని స్తంభాని కానుకుని నిలబడి ఉండేవాడు అతడి కళ్ళద్దాలు అతడు తల కదలించి నప్పుడల్లా వింతగా మెరుస్తూ ఉండేవి. అతడు తను నడచి వచ్చేవైపే చూస్తూ ఉండటం కనిపెట్టింది. ఆ యిల్లు దాటేవరకూ తను అతడిని చూడగలిగేది, అతడు ఆ వీధిమలుపు తిరిగేవరకూ తనను చూడగలిగేవాడు

ఇంచుమించుగా వారానికి రెండుసార్లు ఇలా జరిగేది.

మనసు కుతూహలం పట్టలేక ఎవరినయినా అతడిని గురించి అడిగి తెలుసుకుందామని ఉరకలు వేసేది. కాని అడగలేకపోయింది.

ఒకనాడు యిందుకు భిన్నంగా జరిగింది. తను ఆ వీధిగుండా వస్తుండగా అతడు చూశాడు. ఎప్పుడు చేరుకున్నాడో బస్స్టాండుకు చేరుకుని తనకంటె ముందుగా బస్సెక్కి కూర్చున్నాడు. తనకెక్కడా సీటులేకపోతే కండక్టరు అతడి పక్కనే తనను కూర్చోమన్నాడు అంతటితో ఆ ఘట్టము ఆగలేదు. తను దిగ వలసిన స్టాపులో తనకంటె ముందుగా దిగి తనకంటె ముందు నడవటం మొదలు పెట్టాడు. తనకు మొదట ఆశ్చర్యం-తరువాత కుతూహలం ఆ తరువాత కించిత్ కోపం - ఆపైన రోషం వచ్చేశాయి. మూతి మూడు వంకరలు తిప్పుకుంటూ కాలే జికి వెళ్ళిపోయింది. ఇలా జరగటం మరుసటి వారం నుంచి దినచర్య అయిపో యింది.

ఒకబాటన నడిచే బాటసారు లయిం తరువాత కూడా మాటలు కలపలేదు. కాని క్రమంగా ఆమెలో కోపం_రోషం మటు మాయమయ్యాయి. ఆశ్చర్యం అంతరించిపోయింది. కుతూహలం కనబడకుండా పోయింది వాటి స్థానంలో ఒక అలవాటైన పద్ధతి ఒకనాడు జరగకపోతే ఎలా ఉంటుందో అలా ఏదో వెలితిగా మనసుకు తోచేది. బస్సు ప్రయాణం తలచుకుంటే మనసును ఉల్లాసపరచే భావం మనసులో తీయగా మెదిలి రోజుకొక డిగ్రీ వంతున పెరుగుతూ వుండేది. క్రమంగా అది మధురాతిమధురమై హృదయంలో పీఠం వేసుకుని బరువెక్కటం మొదలు పెట్టింది.

"అయితే ఇలా తనకొక్క దానికేనా?' మనసులో సందేహాస్పదమైన ప్రశ్న ఒకటి బయలుదేరేది. ఏమో! తనకేం తెలుసు? అతడి మనసులో కూడా తన మనసులో బయలుదేరి నటువంటి గందరగోళం ఒకటి బయలుదేరిందేమో?

ఒకనాడు కాలేజికి వెళ్ళటానికి చెప్పులు వేసుకుని బయలుదేరి వాకిట్లోకి రాగానే అతడు వచ్చి - తనను తప్పుకుంటూ గబగబా ప్రక్క వాటాలోకి వెళ్ళాడు.

"ఇదేమిటి? ఇంటికికూడా వచ్చాడు?" అనుకుంది మొదట. "దానికోసం ఎన్నాళ్ళనుంచీ నీవు ఎదురు చూడటం లేదు." అని మనసు ప్రశ్నించింది. అయినా మనసులో ఎన్నో భావాలు - భూమికీ, ఆకాశానికీ అందనివీ - పైకి వ్యక్తం చేయ లేనివీ ఎన్నో ఉంటాయి. అవి మధురమైనవే కావచ్చు. మధురాతిమధురమైనవి కావచ్చు. కాని-అవి తీరా ప్రత్యక్షంగా జరుగుతుంటే హృదయం కంపించిపోదూ? ఒళ్లు జలదరించదూ? అలాగే దుర్గ పరిస్థితిలో మార్పు.

"నేను ఆర్మీలో చేరిపోదాం అనుకుంటున్నా" ఒకనాడు తమ గదిలో చీరె కట్టుకుంటుంటే ప్రక్క వాటాలో నుంచి మాటలు వినబడుతున్నాయి.

"కావాలని ఎందుకు యుద్ధంలోకి వెళ్తావు?" ప్రశ్నిస్తున్నా రెవరో.

"నాకు ఇక్కడేముంది? నేను కావాలనుకునేవాళ్లూ లేరు. నన్ను అదుపులో పెట్టేవాళ్లూ లేరు. ఎక్కడుంటే ఏం? యుద్ధంలో చేరితే దేశసేవ చేసినవాణ్ణయినా అవుతాను" ఏదో వేదాంత ధోరణిలో జవాబు

తను ఆ మాటలు చెవులారా విన్నది. హృదయంలో భయం ఆందోళన చోటు చేసుకున్నాయి "నీ కోసం అలమటించి పోయేదాన్ని నేను లేనా? నేను లేనా?" హృదయం ఆక్రోశించింది.

నిజంగానే ఒకనాడు అతడు ఆర్మీలో మరునాడే చేరబోతున్నాడని ప్రక్క వాటాలోనుంచి విన్నది. ఫలానా రైలులో పయనించ బోతున్నాడని కూడా తెలిసింది.

"తను ఏం చెయ్యాలి?" గుండె గుబగుబ మన్నది. ఆ మరునాడు తనకు తెలియకుండానే స్టేషనుకు అతడికంటె అరగంట ముందుగా వెళ్ళి ప్లాట్‌ఫారం మీద ఉన్న సిమెంటు బెంచిమీద కూర్చుని ఎదురు చూస్తున్నది.

అతడు వచ్చాడు. సాగనంపటానికి వెంట స్నేహితులెవరూ లేరు. ఒంటరిగా నవ్వుతూ వచ్చాడు బెంచి దగ్గరికి.

చివాలున ఆమె లేచి నిలబడ్డది. "మీ సామానేది? మీ స్నేహితులేరీ?" తొట్రుపడ్డది మాట్లాడటానికి. దిగాలు పడినట్టుగా ఉన్న ముఖంలోకి కళ తెప్పించబోయింది.

అతడు మళ్లీ నవ్వాడు. "ఈ ప్రయాణం - ఈ ప్రయాణం...." ననుగుతున్నాడు.

"ఏమిటి....అట్లా నవ్వుతున్నారు? మీ ప్రయాణం ఆగిపోయిందా? లేక మరొక రోజుకు వాయిదా పడ్డదా?" మాటలో అడుద్గా.

"వాయిదా పడ్డట్టే" గంభీరంగా అన్నాడు.

"అయితే ఎప్పటికి వాయిదావేశారు?" అప్పటికి ఆగిపోయిందన్న సంతోషం గొంతులో తొణికిసలాడింది.

"నేననుకున్నది కాకపోతే తప్పకుండా వెళ్తాను" నిర్లిప్తత ముఖం మీద లాస్యం చేసింది అతడికి.

"మీరనుకున్నదేమిటి?" అన్నది కనుబొమలు పైకెత్తి.

"కష్టపడి యింత దూరం వచ్చి నా కోసం ఇంతసేపు కాచుకుని ఉన్నారు. పాపం ఎందుకు వాయిదా వేశానో విని వెళ్ళండి" అన్నాడు మొలక నవ్వులతో. ఆ వాలకం-ఆ నవ్వు ఆ మాటలు చూడగానే ఆమె పసికట్టింది. బుగ్గలు ఎరుపెక్క- లోపల తల వంచుకుంది.

పక్కింటి తాయారు తనతో ఒకనాడు పందెం వేసింది. "సంక్రాంతికి మంచి మంచి ముగ్గులు వాకిట్లో వెయ్యాలి. మీ చదువుకున్నవాళ్ళకు ముగ్గులు రావుగా?" అన్నది.

"నాకూ వచ్చు. మీరు వేసేవాటికంటె పెద్దపెద్దవి, గజిబిజివీ నాకూ వచ్చు" అన్నది పందెం కాచుకో అన్నట్టు.

అందుకని తెల్లవారుఝామున లేచి పేడనీళ్లు చల్లి, తాయారు వేసిందాని కంటె అద్భుతమైన ముగ్గులు కళాత్మకంగా వేయటం మొదలుపెట్టింది. ఒకనాడు పెద్ద ముగ్గు వెయ్యాలని చుక్కలు పెట్టింది. అవి కలిపి పెద్దపెద్ద పద్మాలు వెయ్యా లంటే కుదరలేదు. ఎక్కడో తప్పింది. అందుకే పద్మాలు రావటంలేదని గొణు క్కుంటూ వెనకడుగు వేసింది. కాలికేదో మెత్తగా తగలగానే "ఏమిటి వదినా! నీవుకనబడితే నాకు అపశకునం. అందుకే ముగ్గంతా తప్పిపోయింది" అని జడ విసురుకుంటూ ఒంగిన మనిషి లేవబోయింది.

గల గల నవ్వు వినబడ్డది. మసక చీకటిలో కళ్లు విప్పుకుని చూసింది. ఒదినకాదు-అతడు. పళ్ళన్నీ బయటపెట్టి నవ్వుతున్నాడు.

అతడే పదిరోజుల తరువాత తండ్రి దగ్గరికి వచ్చాడు. కులగోత్రాలు సరిపడ లేదని తండ్రి పెదవి విరిచాడు మొదట కాని కూతురి మనసు కనిపెట్టి కానీ కట్నం

అరగని వజ్రాల కొండను సంతోషంతో అల్లుకున్నా చేసుకున్నాడు. తమరిది ఎటు వంటి దాంపత్యము? లగ్నమునాటి వధూవరుల మాదిరిగా రజితోత్సవము చేసు కున్న నాడుకూడా అలాగే ఉండగలిగారే!

దుర్గకు నవ్వు-నవ్వుతో పాటు సిగ్గూ ముంచుకు వచ్చాయి.

అంతలో ఆమెకు మరొక ఉజ్వల ఘట్టము జ్ఞాపకానికి వచ్చింది,

తనకు నాలుగంటే నాలుగే రోజులు జ్వరం వచ్చింది. చెల్లెలు శాంత తోడుగా ఉంటుందని తల్లి పంపించింది. బావను పరీక్ష చెయ్యాలని తన చెల్లెలు "బావా! అక్కయ్యకు క్షయ అని డాక్టరన్నాడు. నీతో చెప్పొద్దన్నాడు" అన్నది.

అతడిగుండె లవిసిపోయాయి. సెలవు పెట్టి దుర్గ కెదురుగా కూర్చునేవాడు. ఆమె బలవంతమ్మీద తిరిగి ఉద్యోగంలో చేరాడు అతడు ఎంత మారిపోయాడని! దుర్గ కిష్టంలేదని అప్పుచేసి కొన్న స్కూటర్ అమ్మి బ్యాంకులో వేశాడు. పేకట్లపేక ఆడటం మానేశాడు. పొదుపుగా డబ్బు వాడుకోవటం మొదలు పెట్టాడు.

రెండు నెలల లోపుగా వచ్చిన ఈ మార్పుచూసి చెల్లెలు ఒకటే నవ్వు. కాని దుర్గకు గుండె కరిగిపోయింది.

రోజులు ఒక మాదిరిగా ఉండవన్నట్టుగానే కారుప్రమాదంలో ఒకనాడు అతడికి తొడఎముక విరిగిపోయింది. కాలు తీసేయాలన్నారు డాక్టర్లు. కాలు లేక పోయినంత మాత్రాన అతడి రాబడి ఏమీ తగ్గలేదు. అతడు డిజైను ఇంజనీయరు. కూర్చున్నచోటనే డిజైనులు వేసి డబ్బు సంపాదిస్తున్నాడు.

జీవితంలో ఎదురయిన ఒడుదుడుకులవల్ల తమ యిద్దరి మధ్య అనురాగము పల్లవించిందే కాని, వాడిపోలేదు. ముద్దుగా పిల్లలిద్దరూ చెరి ఒకరికి గారాబము.

ఇంకేం కావాలి తనకు? తృప్తిగా నిట్టూరుస్తుంది దుర్గ.

పెనిమిటి చక్రాల కుర్చీలో కూర్చుని వంట యిల్లూ పడకటిల్లూ ఆమెతో కూడా కూడా తిరుగుతూ ఉంటాడు.

అనుకుంటుంది దుర్గ "ఈయనకు కాలు ఇలా అవటంవల్ల మరీ సన్నిహితు లైనారు" అని. ఆ మాటే చెప్పి ఆయనను తన్మయుణ్ణి చేస్తుంది.

అరమోడ్పు కన్నులతో ఆనందాబ్ధిలో మునిగి తేలిన దుర్గ తండ్రి పిలుపుతో ఉలిక్కిపడి లేచింది.

"నీవు ఆఫీసునుంచి వచ్చిన తరువాత నాకు పండ్లరసము యివ్వలేదమ్మా" అన్నాడు తండ్రి.

దుర్గ స్వప్నజగత్తు విదలించుకుని లేచి నిలబడ్డది.

అవును. పక్షవాతంతో మంచం పట్టిన తండ్రిని అన్నలు పట్టించుకోమని తనమీద వదలిపెట్టటము నిజ పరిస్థితి. తన ఆధారమూ చెయ్యిజారి పోతుందన్న భయంతో తండ్రి వచ్చిన సంబంధాలను ఏదో పేరుపెట్టి తిప్పి పంపటము వాస్తవమైన సంగతి.

ముప్పై అయిదు సంవత్సరాలు దాటిన తన కన్నెమనసు రోజుకొక స్వప్నముకంటూ దానిలోనే ఇహపర సుఖాలను పొందుతూ పది సంవత్సరాల నుంచీ గడపటము స్వాప్నిక జగత్తు.

ఇంతమాత్రపు స్వప్న సుఖమైనా లేకపోతే జీవించటం దుర్లభము అనుకుంటుంది దుర్గ. ఆమె కనే మధురాతిమధురమైన కలల్లో ఇది మరీ సుందరమైనది.

(అనామిక - మాస పత్రిక)